WWW.EPAPER.MAHADAILY.COM
ANN తెలుగు
మహా పత్రిక
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
8-2-2025





## జిల్లాలో విస్తృతమవుతున్న మామిడి సాగు

- పూత నుంచి పిందె దశ లోరైతుల జాగ్రత్తలు ఎంతైనా అవసరం
- కాయల పరిమాణం, నాణ్యత పెంచేందుకు ఎరువుల వినియోగం
- పురుగుమందులు సరైన మోతాదులో వాడాలి
- రైతులకు అధికారుల సూచనలు - సలహాలు పాటిస్తే మేలే
- జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఎం.వి మధుసూదన్

02

## అవినీతి.. కొట్లాటలు

- జిల్లా అధికారులకు తలనొప్పిగా మారిన కూసుమంచి పీహెచ్ సీ తీరు
- వైద్యాధికారికి, ఉద్యోగుల మధ్య ముదిరిన వార్
- ఇద్దరు సూపర్ వైజర్లను సరెండర్ చేసిన వైద్యాధికారి..
- రంగంలోకి జిల్లా అధికారులు..
- వైద్యాధికారిపై అవినీతి ఆరోపణలు
- అందరినీ మూకుమ్మడిగా బదిలీచేసి శాఖాపరమైన విచారణ జరపాలన్న వినతులు

08





04

# గాల్లో గరళం

- కాలుష్య మబ్బుల్లో ఖమ్మం
- ఊపిరి తీసుకోవడమే సవాలు!
- పరిశ్రమల ధాటికి ప్రజారోగ్యం దెబ్బతిన్న వైనం
- బొగ్గు గనులు, చెత్త దహనం.. గాలిని విషపూరితం చేస్తున్న తీరు
- ఏ క్యూ ఐ 110 మార్కు దాటి.. ప్రజారోగ్యానికి పెరుగుతున్న ముప్పు
- క్రమక్రమంగా పెరుగుతున్న ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు

ఖమ్మం, మహా

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. పరిశ్రమల విస్తరణ, మైనింగ్ ప్రభావం, వాహనాల ఉద్గారాలు, చెత్త దహనం, నిర్మాణాల ధూళి కలిసిపోవడంతో గాలి నాణ్యత రోజురోజుకు క్షీణిస్తోంది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి తాజా గణాంకాల ప్రకారం, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గాలి నాణ్యత సూచిక 110 మార్కును దాటింది. ఈ స్థాయి ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పుగా పరిగణించబడుతుంది. ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు పెరిగిపోతున్నాయి. అయితే కాలుష్య నివారణకు ఎలాంటి సమర్ధవంతమైన చర్యలు చేపట్టడం లేదు.



### బొగ్గు గనుల ప్రభావం

సింగరేణి ఓపెన్‌కాస్ట్ మైనింగ్ వల్ల ఇల్లెందు, సత్తుపల్లి, కొత్తగూడెం ప్రాంతాల్లో గాలి నాణ్యత మరింత దిగజారుతోంది. మైనింగ్ పేలుళ్లతో కార్బన్ డస్ట్ అధికమై, ప్రజలు ఊపిరాడని స్థితికి చేరుకున్నారు. రోజూ వేలాది టన్నుల బొగ్గు రవాణా చేయడంతో రోడ్లపై దుమ్ము దూలిపోతోంది. మైనింగ్ ప్రభావంతో పరిసర గ్రామాల్లో ప్రజలు తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నారు.

## సిద్ధంగా ఉండండి

- ఎన్నికల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక అవసరం
- బందోబస్తుకు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోండి
- నేర చరిత్ర ఉన్న వాళ్ళ జాబితా తయారు చేసుకోండి
- ప్రతి కేసు విషయంలో నాణ్యత ప్రమాణాలు ఉండాలి
- పోలీస్ కమిషనర్ సునీల్ దత్



03

మహా
8-2-2025



# జిల్లాలో విస్తృతమవుతున్న మామిడి సాగు

| | | | | |
|---|---|---|---|---|
| పూత నుంచి పిందె దశలో రైతుల జాగ్రత్తలు ఎంతైనా అవసరం | కాయల పరిమాణం, నాణ్యత పెంచేందుకు ఎరువుల వినియోగం | పురుగుమందులు సరైన మోతాదులో వాడాలి | రైతులకు అధికారుల సూచనలు - సలహాలు పాటిస్తే మేలే | జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఎం.వి మధుసూదన్ |

**ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 7, మహా:** ఖమ్మం జిల్లాలో మామిడి సాగు విస్తృతంగా కొనసాగుతున్నదని జిల్లా ఉద్యాన , పట్టు పరిశ్రమ అధికారి శ్రీ యం.వి. మధుసూదన్ వెల్లడించారు. జిల్లాలో మొత్తం 32,105 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయని, ముఖ్యంగా సత్తుపల్లి, వేంసూర్, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, ఎర్రుపాలెం తదితర మండలాల్లో అధికంగా సాగు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ప్రధానంగా బంగినపల్లి, దశేరి, హిమాయత్, తోతపూరి, రసాలు వంటి రకాల మామిడి పండ్లను సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే, మామిడి పూత దశ నుంచి పిందె దశలోకి ప్రవేశిస్తున్నదని, ఈ దశలో రైతులు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. మామిడి తోటల్లో నీటి యాజమాన్యం అత్యంత కీలకమని, ఈ దశలో అధిక నీటిని అందిస్తే తామర పురుగు, తేనెమంచు పురుగు, బూడిద రోగం వంటి సమస్యలు పెరిగే ప్రమాదముందని వివరించారు. నీరు తక్కువగా ఇవ్వడంతోపాటు, 8 నుంచి 15 రోజుల వ్యవధిలో భూమిని దున్నడం ద్వారా తేమను సమతుల్యం చేయాలని సూచించారు. మామిడి పిందెలు రాలిపోవడం రైతులకు పెద్ద సమస్యగా మారిందని, దీనికి ప్రధాన కారణాలు నీటి ఎద్దడి, హార్మోనుల లోపం, పోషక లోపాలేనని స్పష్టం చేశారు. పిందె ఏర్పడే దశలో నీటిని సరైన విధంగా అందించడం ద్వారా కాయల వృద్ధిని మెరుగుపర్చవచ్చని తెలిపారు. నీటి సౌకర్యం ఉన్న తోటల్లో చెట్లకు రెండు నుంచి మూడు తడులు ఇవ్వడం ద్వారా పిందెలు రాలకుండా చూసుకోవచ్చని తెలిపారు. నీటి సౌకర్యం లేని తోటల్లో ట్యాంకర్ల సహాయంతో నీటిని అందించినా ఖర్చుకు మించి ఆదాయం వచ్చే అవకాశం ఉందని వివరించారు. మామిడి పిందె దశలో కాయల పరిమాణాన్ని పెంచే ఎరువుల వాడకం కూడా అత్యంత కీలకమని చెప్పారు. చెట్ల పరిమాణాన్ని బట్టి 500 నుంచి 1000 గ్రాముల యూరియా, 500 నుంచి 1000 గ్రాముల పోటాష్ ఎరువులను రెండు కిలోల వేపపిండితో కలిపి ప్రతిచెట్టుకూ వేయడం ద్వారా మంచి నాణ్యత కలిగిన, పెద్ద పరిమాణంలోని కాయలు వస్తాయని తెలిపారు. పంటలో రసాయన మందుల వాడకాన్ని విపరీతంగా పెంచకుండా, అవసరమైన చోట మాత్రమే సిఫార్సు చేసిన మోతాదులోనే ఉపయోగించాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం మామిడి పూత దశలో ఉండటంతో నాలుగు ప్రధాన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, నిక్కుడు పురుగు (సెమీ లూపర్), తేనెమంచు పురుగు, తామర పురుగు, బూడిద రోగం, పక్షి కన్ను తెగులు ప్రభావం చూపవచ్చని హెచ్చరించారు. ఈ తెగుళ్లను అరికట్టేందుకు 500 లీటర్ల నీటిలో ఇమిడక్లోప్రిడ్ం ఫిప్రోనేల్ (పోలీసు %వ్ఎ%) 100 గ్రాములు, ఎమ్మమెక్టిన్ బెంజోయేట్ 250 గ్రాములు, మారినో 1 లీటర్, బొరన్20 500 గ్రాములు, హెక్సకోణాజోలు 1 లీటర్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రైతులు పురుగుల నివారణ కోసం ఒకే విధమైన మందులను పునరావృతంగా ఉపయోగించకూడదని, ఒకసారి చల్లిన మందులను మళ్లీ వాడితే పురుగులు తట్టుకునే శక్తిని పెంచుకుని ప్రభావం చూపకుండా పోయే అవకాశం ఉందని తెలిపారు. అందుకే ప్రతీ సమస్యకు విభిన్న రకాల మందులను సిఫార్సు చేయడం జరిగిందని వివరించారు. సిఫార్సు చేసిన మందులను మాత్రమే నిర్ణీత మోతాదులో వాడాలని, అధిక మోతాదులో వాడితే అనుకూల ప్రభావం కాకుండా ప్రతికూల ప్రభావం కలుగుతుందని హెచ్చరించారు. వ్యాపారుల సూచనల మేరకు మందులను కొనుగోలు చేయకుండా, అధికారుల సలహా మేరకు ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. అధికారులు రైతుల సహాయార్థమే పనిచేస్తున్నారని గుర్తుంచుకుని, ఎప్పటికప్పుడు వారి మార్గదర్శకాన్ని పాటించాలని సూచించారు. అవసరమైతే సంబంధిత అధికారులను సంప్రదించి మరింత స్పష్టమైన సమాచారం పొందాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో మామిడి తోటలు విస్తృతంగా సాగుచేయడం ఆనందకరమైన విషయమని, రైతులు సరైన విధానాలను అనుసరిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యాన %ు% పట్టు పరిశ్రమ అధికారి శ్రీ యం.వి. మధుసూదన్ పేర్కొన్నారు.



## ట్రాక్టర్ బోల్తా ఘటనలో మరణించిన కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొంగులేటి



**బోనకల్, ఫిబ్రవరి 7, మహా:** మండలంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. పర్యటనలో భాగంగా ఎస్సార్ గార్డెన్స్ నందు జరుగుతున్న గుడ్డూరి వెంకటేశ్వర్లు కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి నూతన వస్త్రాలను కానుకగా అందించారు. అనంతరం ఇటీవలే ట్రాక్టర్ బోల్తా ప్రమాదంలో మరణించిన మృతురాలు యార్లగడ్డ వరమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.క్షతగాత్రులను అందరినీ పరామర్శించి, వారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు, ట్రాక్టర్ ప్రమాద ఘటన గాయపడిన వారికి ఆర్థిక సహాయం అందించారు.

## తల్లిని కోల్పోయిన కుటుంబం



**నెలకొండపల్లి, ఫిబ్రవరి 7, మహా:** తల్లిని కోల్పోయిన కుటుంబం కన్నీరుము న్నీరైంది. ఇంటి నుంచి వెళ్లిన తల్లి తిరిగి రాకపోవడంతో బిడ్డలు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. నలుగురు కుమారులు ఆమె కోసం అనేక ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. చివరకు తల్లిని సజీవంగా చూడలేకపోయామని భావించి నిరాశలో మునిగిపోయారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహానికి అన్నం ఫౌండేషన్ సాయంతో పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. మూడు నెలల తర్వాత ఆమె తమ తల్లేనని తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆ స్థలానికి వెళ్లి నివాళులర్పించి రోదించారు. నల్లగొండ జిల్లా కేతపల్లి మండలం ఉప్పలపహాడ్‌కు చెందిన కుక్కమూడి కిష్టమ్మ నవంబర్ 27న వేములవాడ వెళ్తూ సాగర్ కాల్వలో గల్లంతైంది. డిసెంబర్ 17న పాలేరు వద్ద ఆమె మృతదేహం లభించగా, గుర్తుపట్టలేని స్థితిలో ఉండటంతో డిసెంబర్ 25న అంత్యక్రియలు పూర్తయ్యాయి.

## సీపీఐ(ఎం) సానుభూతిపరురాలు వడ్డూరిసీతమ్మ మృతి



**కారేపల్లి, ఫిబ్రవరి 7, మహా:** సీపీఐ(ఎం) మాణిక్యారం శాఖ సభ్యుడు వడ్డూరి వీరబాబు మాతృమూర్తి తిరుమలాయపాలెంకు చెందిన వడ్డూరి సీతమ్మ శుక్రవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, కొమ్ము శ్రీనివాసరావు లు సందర్శించి నివాళ్లు ఆర్పించారు. సీతమ్మ కుమారులైన పుల్లయ్య, వీరబాబు, శ్రీను లకు సానుభూతిని తెలిపారు. నివాళ్లు ఆర్పించిన వారిలో సీపీఐ(ఎం) నాయకులు పోతర్ల నాగేశ్వరరావు, మేకల వీరన్న, వల్లపు మల్లయ్య, రేపాకుల వీరభద్రం, పోలేపల్లి రవి, అనుసూరి శ్రీనివాసరావు, దేగటి గోపాలు, బుసరాజు పాపులు, గుడిపాటి పాపారావు. ఈశ్వరమ్మ, అరుణ, ఉపేందర్, కొండబోయిన జ్యోతిబాస్, కుర్ర వీరన్న, దేగటి రాజు, వీరునాయక్ తదితరులు ఉన్నారు.

## మావోయిస్టు మిలీషియా గుట్టురట్టు

**చర్ల, ఫిబ్రవరి 7, మహా:** చర్ల మండల పరిధిలో మావోయిస్టు మిలీషియా కార్యకలాపాలను భగ్నం చేస్తూ పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. తాలిపేరు ప్రాజెక్టు సమీపంలోని తిప్పాపురం రహదారిలో శుక్రవారం రాత్రి ఎస్సై నర్సిరెడ్డి నేతృత్వంలో పోలీసులు తనిఖీలు నిర్వహించగా నలుగురు అనుమానాస్పదంగా కదులుతూ కనిపించారు. పోలీసులు అడుగులు పెట్టగానే వారు పారిపోవడానికి ప్రయత్నించగా వెంటాడి పట్టుకున్నారు. విచారణలో వీరు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన గట్టుపల్లి ఊర అలియాస్ సోమన్న, మడకం ఉంగ, కడితి లక్కే అలియాస్ మంజు, సోడి సుక్కిలుగా గుర్తించారు. వీరు మావోయిస్టు పామేడు ఏరియా కమిటీ డీవీసీ సభ్యురాలు సుక్కి ఆదేశాలతో కీలక సామాగ్రిని తరలించేందుకు వచ్చినట్టు విచారణలో వెల్లడైంది.

మహా
8-2-2025




# సిద్ధంగా ఉండండి

**ఎన్నికల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక అవసరం**

**బందోబస్తుకు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోండి**

**నేర చరిత్ర ఉన్న వాళ్ళ జాబితా తయారు చేసుకోండి**

**ప్రతి కేసు విషయంలో నాణ్యత ప్రమాణాలు ఉండాలి**

**పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ఖమ్మం , ఫిబ్రవరి 7, మహా:** రాబోయే స్థానిక సంస్థల, గ్రామ పంచాయతీల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికతో సన్నద్ధంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చిన స్థానిక పోలీస్ అధికారులు అప్రమత్తంగా వుంటూ. శాంతి భద్రతల పరిరక్షణ, ఎన్నికల బందోబస్తు పోలీసులకు సవాల్‌గా మారకుండా ముందస్తుగా పోలీస్ అధికారులు బందోబస్తుకు రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని, క్షేత్రస్థాయిలో పోలింగ్ స్టేషన్లు, బూత్‌ల వద్ద పరిస్థితులు, వనరులపై వివరాలు సేకరించాలని సూచించారు. సాధారణ, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేటగిరీల్లో పోలింగ్ బూత్‌లను విభజించే మేరకు బందోబస్తుకు ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. ఎన్నికల సంబంధిత నేరాల చరిత్ర ఉన్న వారు, రౌడీ షీటర్లు, ఎన్నికల్లో శాంతికి విఘాతం కలిగించే వారి జాబితాను సిద్ధం చేయాలని అన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఎవరెవరిపై కేసులు ఉన్నాయనే వివరాలను పోలీస్ స్టేషన్ల వారీగా సేకరించి, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ అధికారులు ప్రణాళికలు రూపొందించాని సూచించారు. అదేవిధంగా ప్రతి కేసు విచారణలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తద్వారా నిందుతులకు శిక్ష పడి నిజమైన బాధితులకు న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఆడ్మిన్ నరేష్ కుమార్, అడిషనల్ డీసీపీ లా%ు%ఆర్డర్ ప్రసాదరావు , ఏసీపీ వేంకటేశ్, సాంబారాజు, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

## పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ధన్యవాదాలు



**కూసుమంచి, ఫిబ్రవరి 7,మహా:** చిన్న తిరుపతిగా పేరుగాంచిన కూసుమంచి మండలం జీళ్ళచెరువు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి సహాకరించి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిన రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబురు దయాకర్ రెడ్డికి జీళ్ళచెరువు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొండా శ్రీనివాస్ రావు, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొక్క ఉపేందర్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. జీళ్ళచెరువు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ రోడ్డును మంజూరు చేయాలని గత కొద్ది నెలలుగా కాంగ్రెస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో అనేక మార్లు వినతి చేయగా స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి గుట్టమీదకు రెండు వరుసల రోడ్డు, డ్రైనేజీ, గుట్టపైన సుమారు 100 మీటర్ల మేర ప్లాట్ ఫామ్, కళ్యాణ మండపం పతం నిర్మాణానికి రూ.2.60కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిసిందన్నారు. అలాగే దేవునితండా నుంచి కేశ్వాపురం, జీళ్ళచెరువు, గోపాలరావుపేట మీదుగా తల్లంపాడు వరకు బీటీ రోడ్డును మంజూరు చేశారు. ఎన్నో ఏళ్ళ,కల నెరవేర్చిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి గ్రామస్థుల తరుపున, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాలక సభ్యుల తరుపునా కృతజ్ఞతలు తెలిపారు.

## రక్తహీనత కట్టడికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేంటి...?



**ఖమ్మం, ఫిబ్రవరి 7, మహా:** మహిళలు, పిల్లలకు సంబంధించి రక్తహీనత కేసులు దేశంలో పెరుగుతున్నాయని, దీని నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతోంది..? అని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో శుక్రవారం ప్రశ్నించారు. దీనికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల సహాయ మంత్రి అనుప్రియా పటేల్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. గర్భిణులకు సంబంధించి 2019- 21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో రక్తహీనత ప్రభావం 53.2 శాతంగా ఉన్నట్లు తెలిపారు. పిల్లల్లో..ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు వారిలో రక్తహీనత ప్రాబల్యం 67.1 శాతంగా, మహిళల్లో (15-49 ఏళ్ళు) 57 శాతంగా ఉన్నట్లు చెప్పారు. 2024 డిసెంబర్ వరకు ఉన్న గణాంకాలు ప్రకారం.. 6-59 నెలల పిల్లల్లో 45.3% మందికి ఐఎఫ్ఏ సిరప్, గర్భిణుల్లో 95 శాతం మందికి ఐఎఫ్ఏ రెడ్ టాబ్లెట్లు అందించినట్లు తెలిపారు. రక్తహీనత వ్యాప్తిని తగ్గిం చేందుకు.. అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహిస్తోందని అన్నారు. పిల్లల కోసం ఐరన్, ఫోలిక్ యాసిడ్, మహిళలు, గర్భిణుల కోసం ప్రత్యేక మందులు అందజేస్తు న్నామని, ఒక ప్రణాళిక ప్రకారం.. వైద్య పరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్ పెరుగుదలకు బలవర్ధక, పోషకాహారాలను సూచిస్తున్నట్లు చెప్పారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా.. పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయిస్తున్నామని కేంద్ర మంత్రి వివరించారు.

## రైతు పంట నమోదు చేసుకోవాలి

**కూసుమంచి, ఫిబ్రవరి 7, మహా:** రైతులందరు తప్పకుండా తాము పండించే పంటలను ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలని కూసుమంచి డివిజన్ అగ్రికల్చర్ వ్యవసాయ శాఖ అధికారి సరితా, కూసుమంచి ఏఓ రామడుగు వాణి సూచించారు. శుక్రవారం కూసుమంచి మండలంలోని తురకగూడెం గ్రామంలో డిజిటల్ పంట నమోదు కార్యక్రమాన్ని కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సరిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయం విస్తరణ అధికారులు అందరూ పకడ్బందీగా పంట నమోదు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఏ ఈ ఓ లు పంట నమోదు ఎటువంటి పొరపాట్లు లేకుండా చేయాలని తద్వారా పంటను అమ్ముకోవడానికి ఇబ్బందులు ఉండవని తెలిపారు. అనంతరం కూసుమంచి లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం పామ్ ఆయిల్ సాగుపై రైతులు ఆసక్తి చూపాలని కోరారు.



మహా
8-2-2025




### చెత్త దహనం -మున్సిపాల్టీల నిర్లక్ష్యం

ఖమ్మం, కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో చెత్త నిర్వహణ సరిగా లేకపోవడంతో ఖాళీ ప్రదేశాల్లో చెత్త గుట్టలు పేరుకుంటున్నాయి. అవి తగలబెట్టడంతో డయాక్సిన్, ఫ్యురాన్ వంటి ప్రమాదకర వాయువులు గాలిలో కలుస్తున్నాయి. రోజూ 341 మెట్రిక్ టన్నుల చెత్తలో 79 టన్నుల మేర మున్సిపాల్టీలు కాల్చేస్తున్నాయి. ఇది ఊపిరితిత్తుల వ్యాధులకు దారితీస్తోంది.

### వాహన పొగ - పెరిగిన ముప్పు

పాత వాహనాల వినియోగం అధికంగా ఉండటం, కాలుష్య నియంత్రణ నియమాలు పాటించకపోవడం వల్ల వాహనాల పొగ వాయుమండలాన్ని మరింత కలుషితం చేస్తోంది.

# గాల్లో గరళం

## కాలుష్య మబ్బుల్లో ఖమ్మం

ఖమ్మం -మహా

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. పరిశ్రమల విస్తరణ, మైనింగ్ ప్రభావం, వాహనాల ఉద్గారాలు, చెత్త దహనం, నిర్మాణాల ధూళి కలిసిపోవడంతో గాలి నాణ్యత రోజురోజుకు క్షీణిస్తోంది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి తాజా గణాంకాల ప్రకారం, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గాలి నాణ్యత సూచిక110 మార్కును దాటింది. ఈ స్థాయి ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పుగా పరిగణించబడుతుంది. ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు పెరిగిపోతున్నాయి. అయితే కాలుష్య నివారణకు ఎలాంటి సమర్థవంతమైన చర్యలు చేపట్టడం లేదు.

- ఊపిరి తీసుకోవడమే సవాలు!
- పరిశ్రమల ధాటికి ప్రజారోగ్యం దెబ్బతిన్న వైనం.
- బొగ్గు గనులు, చెత్త దహనం.. గాలిని విషపూరితం చేస్తున్న తీరు.
- ఏ క్యూ ఐ 110 మార్కు దాటి.. ప్రజారోగ్యానికి పెరుగుతున్న ముప్పు.
- క్రమక్రమంగా పెరుగుతున్న ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు.

### విషపూరిత వాయువుల ముప్పు

పాల్వంచ, కొత్తగూడెం, మణుగూరు ప్రాంతాల్లో భారీ పరిశ్రమలు పెద్దఎత్తున విస్తరించాయి. స్టీల్, సిమెంట్, కెమికల్ ఫ్యాక్టరీలు రోజూ వందలాది టన్నుల విషపూరిత వాయువులను విడుదల చేస్తున్నాయి. సల్ఫర్ డయాక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్, కార్బన్ మోనోఆక్సైడ్ వంటి ప్రమాదకర వాయువులు గాలిలో కలసిపోతున్నాయి. పరిశ్రమల వద్ద పొగమంచు మాదిరిగా గాలి కనిపించడం ఇది ఎంత ప్రమాదకరమైన పరిస్థితి అనేది తెలియజేస్తోంది.

### బొగ్గు గనుల ప్రభావం - మైనింగ్ ముప్పు

సింగరేణి ఓపెన్‌కాస్ట్ మైనింగ్ వల్ల ఇల్లెందు, సత్తుపల్లి, కొత్తగూడెం ప్రాంతాల్లో గాలి నాణ్యత మరింత దిగజారుతోంది. మైనింగ్ పేలుళ్లతో కార్బన్ డస్ట్ అధికమై, ప్రజలు ఊపిరాడని స్థితికి చేరుకున్నారు. రోజూ వేలాది టన్నుల బొగ్గు రవాణా చేయడంతో రోడ్లపై దుమ్ము దూలిపోతోంది. మైనింగ్ ప్రభావంతో పరిసర గ్రామాల్లో ప్రజలు తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నారు.

### ప్రజారోగ్యంపై పెరుగుతున్న ముప్పు

- ఊపిరితిత్తుల సమస్యలు, ఆస్తమా, బ్రాంకైటిస్ కేసులు పెరుగుతున్నాయి
- గుండె, ఊపిరితిత్తుల వ్యాధులతో ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య పెరిగింది
- పిల్లలు, వృద్ధులు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు
- వర్షాలు ఆమ్ల వర్షాలుగా మారే ప్రమాదం ఉంది

### ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు

- పరిశ్రమల ఉద్గార నియంత్రణపై కఠిన నిబంధనలు అమలు చేయాలి
- మైనింగ్ పేలుళ్ల తీవ్రత తగ్గించేందుకు అధునాతన పద్ధతులు అనుసరించాలి.
- చెత్త దహనం పూర్తిగా ఆపేసి శాస్త్రీయ రీసైక్లింగ్ విధానాలను ప్రోత్సహించాలి.
- పాత వాహనాలపై నిఘా పెట్టి, కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోవాలి.
- ప్రధాన పట్టణాల్లో గాలి నాణ్యత పరిశీలించేందుకు అధునాతన మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- ప్రతి పరిశ్రమ పరిసరాల్లో మరింత మందం మొక్కలు నాటాలి.



# కరాటే పోటీల్లో విజయకేతనం..



బూర్గంపాడు, ఫిబ్రవరి 7 , మహా: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో అంతర్జాతీయ కరాటే పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులను సత్కరించే కార్యక్రమం ఘనంగా జరిగింది. గురువారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సారపాక ఈఓ. మహేష్ హాజరై, పోటీల్లో గెలిచిన క్రీడాకారులను అభినందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి 11 మంది విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారని, వారిలో నలుగురు బంగారు, ఇద్దరు రజత, ఐదుగురు కాంస్య పతకాలు సాధించడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. కరాటే పోటీల్లో సాధించిన విజయం విద్యార్థులకు మరింత ఉత్తేజాన్నిస్తుందని, భవిష్యత్తులో వారు అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని ఘనతలు సాధించాలని ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరు ఆకాంక్షించారు.

# ఘనంగా మాతా రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలు



బూర్గంపాడు , ఫిబ్రవరి 7 , మహా: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం కృష్ణసాగర్‌లో మాతా రమాబాయి అంబేద్కర్ 127వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ మాల మహానాడు బూర్గంపాడు యూత్ అధ్యక్షుడు సల్మాది యశ్వంత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జాతీయ మాల మహానాడు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్టి శ్రీనివాసరావు, పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు పిల్లి రవి వర్మ ఈ వేడుకలకు హాజరై, మాతా రమాబాయికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పిల్లి రవి వర్మ మాట్లాడుతూ, “తాను కొవ్వొత్తులా కరిగిపోతూ మనందరి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయురాలు మాతా రమాబాయి అంబేద్కర్. ఆమె జీవితమే త్యాగానికి పరాకాష్ఠ. అంబేద్కర్ ఆశయాలకు తోడుగా నిలిచి, తన కుటుంబాన్ని అంతా దేశ ప్రజల సంక్షేమార్థం అర్పించిన మహత్మి. ఈ సమాజం ఆమె త్యాగాన్ని ఎప్పటికీ మరవలేదు” అని అన్నారు.ఈ కార్యక్రమంలో తాటి సుధాకర్, పొన్నాల నారాయణ, నిత్యశ్రీ, రామకృష్ణ, బద్రి తదితరులు పాల్గొని మాతా రమాబాయికి ఘనంగా నివాళులు అర్పించారు.

# దశదిన కర్మలో పాల్గొన్న టీడీపీ, కాంగ్రెస్ నేతలు

బూర్గంపాడు, ఫిబ్రవరి 7, మహా: మణుగూరుకు చెందిన లింగమనేని హరి దశదిన కర్మలో గురువారం టీడీపీ, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. హరి చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించిన టీడీపీ నాయకుడు వాసిరెడ్డి చలపతి రావు, కాంగ్రెస్ నేతలు కటుకూరి శ్రీనివాసరావు, కోడి అశోక్ కుమార్, దొడ్డపనేని మధుకుమార్, జరుపుల జగన్, త్రిమూర్తులు తదితరులు హాజరయ్యారు.





# 70 ఏళ్ల వయసులో రోడ్ల మీద ఉద్యమం

- రిటైర్మెంట్ ఉద్యోగుల హక్కులకు తూట్లు
- లీవ్ ఇన్ క్యాష్మెంట్ కోసం పోరాటం
- హైయర్ పెన్షన్ నోటీసులు
- రిటైర్డ్ ఉద్యోగులపై పెనుభారం
- 2017, 2021 పీఆర్సీ అమలు చేయకపోవడంతో రిటైర్డ్ ఉద్యోగుల ఆవేదన
- ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్

ఖమ్మం-మహా: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టి.జి ఆర్టీసీ) రిటైర్డ్ ఉద్యోగులు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారు. పదవీ విరమణ అనంతరం రావాల్సిన లీవ్ ఇన్ క్యాష్మెంట్, పెన్షన్, డీఏ ఏరియర్స్, హయ్యర్ పెన్షన్ అమలు వంటి హక్కులు పొందలేక, అనేకమంది ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిందని చెప్పినా, రిటైర్డ్ ఉద్యోగులకు ఈ ప్రయోజనాలు అమలుకాకపోవడంతో, వారు మళ్లీ వీధిన పడే పరిస్థితి ఏర్పడింది.

## వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగుల ఆందోళన

తెలంగాణలో ఆర్టీసీ సేవలలో పని చేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సంఖ్య సుమారు 14,000 పైచిలుకు. వీరిలో అత్యధిక శాతం ఉద్యోగులు లీవ్ ఇన్ క్యాష్మెంట్, పెన్షన్, పెండింగ్ డీఏలు వంటి విషయాల్లో ప్రభుత్వం నుంచి సరైన సహాయ సహకారాలు పొందలేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్ నగర్, కరీంనగర్ ప్రాంతాల్లో రిటైర్డ్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు, వారు పనిచేసిన కాలంలో వదిలిన వేతన రహిత సెలవులను లీవ్ ఇన్ క్యాష్మెంట్ ద్వారా నగదుగా మార్చి చెల్లించాలి. కానీ, 2019 నుంచి ఇప్పటివరకు ఈ చెల్లింపులు నిలిచిపోయాయి. లీవ్ ఇన్ క్యాష్మెంట్ అమలు చేయకపోవడంతో, రిటైర్డ్ ఉద్యోగులు కుటుంబ పోషణలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కొంతమంది అప్పులు చేసి, కొందరు తాము పనిచేసిన ఆర్టీసీ ఆఫీసుల చుట్టూ తిరుగుతూ నిరసనలు చేపడుతున్నారు.

> రిటైర్మెంట్ అయిన ఉద్యోగులను ఎందుకు పక్కన పెడుతున్నారు? మేము ఏ రోజుకా ఉద్యోగం చేసుకున్నామా? మా హక్కులను ఎందుకు కాదనుతున్నారు? అంటూ రిటైర్మెంట్ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

## హైయర్ పెన్షన్ కోసం మరోసారి డబ్బు చెల్లించాలంటూ నోటీసులు

గత ప్రభుత్వ హయాంలో ఈపీఎఫ్ హైయర్ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు ఇప్పుడు మరోసారి భారీ మొత్తాన్ని చెల్లించాలంటూ నోటీసులు రావడం రిటైర్డ్ ఉద్యోగులకు తలబిడి పెంచింది. “పదవీ విరమణ సమయంలో మేం పొందాల్సిన మొత్తాలను ఇవ్వకుండా, ఇప్పుడు మేమే డబ్బు చెల్లించాలి అంటారా?” అంటూ ఉద్యోగులు మండిపడుతున్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని సమీక్షించి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## పీఆర్సీ వివక్ష -%2017, 2021 పీఆర్సీ అమలు కోసం డిమాండ్

2017లో సేవలో ఉన్న ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేసినప్పటికీ, రిటైర్డ్ ఉద్యోగులకు వర్తింపజేయలేదు. ఇదే విధంగా, 2021లో వచ్చిన పీఆర్సీ కూడా ఇప్పటి వరకు రిటైర్మెంట్ ఉద్యోగులకు అమలుచేయలేదు. ఉద్యోగంలో ఉన్నవారికి మాత్రమే వేతన సవరణలు వర్తింపజేయడం, రిటైర్డ్ ఉద్యోగులను మర్చిపోవడం అన్యాయమని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## అస్పష్టతతో పెరుగుతున్న అనిశ్చితి

2019లో ఆర్టీసీని ప్రభుత్వ అధీనంలోకి తీసుకున్నప్పటికీ, ఇప్పటి వరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించ లేదు. పదవీ విరమణ సమయంలో వారికి రావాల్సిన ప్రయోజనాల అమలులో స్పష్టత లేకపోవడంతో, రిటైర్డ్ ఉద్యోగులు ఇంకా అనేక అనిశ్చిత పరిస్థితిలో ఉన్నారు.

## 70 ఏళ్ల వయసులో ఉద్యమం

తమ హక్కుల కోసం 70 ఏళ్ల వయసున్న రిటైర్డ్ ఉద్యోగులు హైదరాబాద్ హెడ్ ఆఫీస్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్నారు. “మా వయస్సు 70. ఇంత వయస్సులో మేం దిక్కులేని పరిస్థితిలో పడతామనుకోలేదు. ప్రభుత్వం మాపై కనీస కనికరమైన చూపించాలి.” అంటూ వారు వాపోతున్నారు.

## ప్రభుత్వానికి ఉద్యోగుల విజ్ఞప్తి

రిటైర్మెంట్ ఉద్యోగులు ప్రభుత్వం తక్షణమే స్పందించాలి అంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా, లీవ్ ఇన్ క్యాష్మెంట్ చెల్లింపులు, పెన్షన్ సమస్యలు, హైయర్ పెన్షన్ కోసం డబ్బు చెల్లించాలనే నోటీసులు, 2017, 2021 పీఆర్సీ అమలు వంటి విషయాల్లో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. “న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు. అవసరమైతే పెద్దఎత్తున ఉద్యమిస్తాం. మేము చేసిన సేవకు గౌరవం ఇవ్వాలి!” అంటూ రిటైర్డ్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# మహా 6

8-2-2025



# క్రీడామైదానమా? అసాంఘిక చర్యల కేంద్రమా?

### పెవిలియన్ గ్రౌండ్ లో కథలు కథలు

### ప్రేమికులకు అడ్డాగా మారిన వైనం

### క్రీడా సంస్కృతిని మరిచిపోతున్న పాలకులు

### వాణిజ్యానికి బలి అయిన క్రీడామైదానం

**ఖమ్మం - మహా:** ఖమ్మంలోని క్రీడా చరిత్రకు ముఖ్యమైన ప్రదేశంగా పేరుగాంచిన పెవిలియన్ గ్రౌండ్, మారుతున్న కాలంతో తన గుర్తింపు కోల్పోతూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. ఒకప్పుడు క్రీడాకారులతో కళకళలాడిన ఈ మైదానం, ఇప్పుడు నిర్లక్ష్య పాలనతో ప్రేమజంటల కేంద్రంగా, అవాంఛిత చర్యల గూటిగా మారడం ఆందోళన కలిగించే అంశం. నగరంలోని వాకింగ్ చేసే ప్రజలు, కుటుంబాలతో వచ్చే వారంతా అసౌకర్యానికి గురవుతున్నారు. పాలకులు స్పందించకపోతే ఖమ్మం క్రీడా సంస్కృతి మరింత దారుణ స్థితిలోకి జారిపోతుందనే భయం పట్టుకుంది. ఇప్పుడు ఈ మైదానం పునరుజ్జీవనానికి మార్గదర్శక చర్యలు అవసరమైపోయాయి. ఖమ్మంలోని ప్రముఖ మైదానాలలో ఒకటైన పెవిలియన్ గ్రౌండ్ గతంలో క్రీడాసంస్థల పరిపాలనా కేంద్రంగా, ఆటగాళ్లకు ప్రాణాధారంగా నిలిచింది. వివిధ క్రీడా పోటీలు, సమీకరణాలు, ప్రభుత్వ కార్యకలాపాలతో ప్రజలకు సుపరిచితమైంది. కానీ క్రమంగా ఈ స్థలాన్ని వాణిజ్య కార్యక్రమాలకు ఉపయోగిస్తూ నగర పాలక సంస్థ నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తోంది. నగర క్రీడా రంగానికి కేంద్ర బిందువుగా మారిన సర్దార్ పటేల్ స్టేడియం ఆధునీకరణతో పెవిలియన్ గ్రౌండ్ ప్రాముఖ్యత తగ్గిపోయింది. ప్రభుత్వ ప్రోత్సాహం తగ్గడంతో క్రీడాకారుల సంఖ్య క్రమంగా తరిగిపోగా, కొంతమంది మాత్రం దానిని మందరించిన , మిగిలిన భాగాన్ని కాలక్షేపానికి మార్చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కొందరు వాకింగ్‌కు వస్తున్నా, మిగతా సమయాల్లో అనేక అనైతిక కార్యకలాపాలు కొనసాగుతుండడం గమనార్హం.



### ప్రేమికుల గూటిగా మారిన గ్రౌండ్

ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాశాల విద్యార్థులు, యువకులు తమ స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకుంటున్నారు. అసాంఘిక చర్యలకు గ్రౌండ్ కేంద్రంగా మారుతుండటం ఇక్కడ సాధారణంగా కనిపించే దృశ్యంగా మారింది. కళాశాల ప్రేమజంటలు అడ్డూ అదుపూ లేకుండా ప్రవర్తించడం, మితిమీరిన ప్రవర్తనతో కుటుంబ సభ్యులు ఇక్కడికి రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది.

### ప్రశాంతత కోల్పోతున్న పెవిలియన్ ప్రాంతం

ఈ మైదానం పచ్చదనాన్ని ఆస్వాదించేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు పలువురు రావడం సాధారణం. కానీ అసాంఘిక కార్యకలాపాల పెరుగుదలతో వారు కూడా ఇక్కడ ప్రశాంతంగా ఉండలేని స్థితి ఏర్పడింది. చెట్ల కింద సేదతీరే వారికి యువత వికృత చేష్టలు అసహనానికి గురిచేస్తున్నాయి. పాదచారులకు భద్రత లేకుండా పోవడం, అస్వచ్ఛత పెరగడం మరో సమస్యగా మారింది.

### కార్పొరేషన్, పోలీసుల స్పందన అవసరం

పెవిలియన్ గ్రౌండ్ మునుపటి కీర్తిని తిరిగి పొందాలంటే అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసుల కఠిన చర్యలు అవసరం. గ్రౌండ్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, క్రీడలకు మరింత ప్రోత్సాహం ఇవ్వాలి. నిర్లక్ష్యంతో వదిలేసిన ఈ మైదానాన్ని క్రీడాసంస్థల సంరక్షణలోకి తీసుకురావడం, పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంచడం సమయస్ఫూర్తిగా మారింది. ఖమ్మం నగరానికి ప్రతిష్ఠను తీసుకువచ్చిన ఈ క్రీడామైదానం, పునరుజ్జీవనంతో మళ్లీ క్రీడాకారులను ఆకర్షించాలి. అధికార యంత్రాంగం దృష్టి పెట్టకపోతే, పెవిలియన్ గ్రౌండ్ ఒక అసాంఘిక కేంద్రంగా పూర్తిగా మారిపోయే ప్రమాదం తప్పదు.

# మంచుకొండ శివారులో రోడ్డు ప్రమాదం





**రఘునాథపాలెం, ఫిబ్రవరి 7 , మహా:** రఘునాథపాలెం మండల పరిధిలోని మంచుకొండ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. మృతులు ఉదయనగర్‌కు చెందినవారిగా గుర్తించినట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. వేగంగా దూసుకొచ్చిన వాహనం ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీ కోసం పోలీసులు సీసీటీవీ ఫుటేజీ పరిశీలిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

### సంత్ శ్రీ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని

# ఘనంగా నిర్వహించాలి



**ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 7, మహా:** సంత్ శ్రీ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఫిబ్రవరి 15న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గోర్ బంజారా సమాజం ఘనంగా నిర్వహించాలని, ప్రతి ఇంటిపై సేవాలాల్ మహారాజ్ జెండాను ఆవిష్కరించాలని తెలంగాణ గోర్ బంజారా ఎంప్లాయిస్ ఫెడరేషన్ (టీజీబీఈఎఫ్) నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో టీజీబీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా శోభన్ నాయక్, రాష్ట్ర కోశాధికారి ధరావత్ రాములు నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా లచ్చు నాయక్ పాల్గొని జయంతి వేడుకల నిర్వహణపై సమగ్రంగా చర్చించారు.

# జాతర దుకాణాలకు ఈ నెల 9న వేలంపాటలు..

**కారేపల్లి, ఫిబ్రవరి7 ,మహా:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 26వ తేదీ నుండి జరిగే సింగరేణి మండల పరిధిలోని కోటిలింగాల జాతరలో దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు ఈనెల 9వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ అలెం వెంకటేశ్వర్లు తెలిపారు.సింగరేణి మండలం పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కోటిలింగాల జాతర మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా మూడు రోజులపాటు ఘనంగా జరగనుంది. ఈ జాతరలో కొబ్బరికాయలు, లడ్డు, కొబ్బరి చిప్పలు, ఇతర వ్యాపారాలు నిర్వహించుకునేందుకు 9వ తేదీ ఉదయం 10 గంటలకు ఆలయంలో వేలంపాటలు నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి ఉన్న వ్యాపారులు ఈ వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.



# గ్రామంలో ఎమ్మెల్సీ తాత మధు పర్యటన



**కారేపల్లి, ఫిబ్రవరి 7, మహా:** ఏడాది పాటు సాగుతున్న కాంగ్రెస్ పాలనపై ప్రజలు విరక్తి చెందుతున్నారని బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ రావు అన్నారు. కారేపల్లి మండల పరిధిలోని భాగ్యనగర్ తండాలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లిన ప్రభుత్వం పై ప్రజా వ్యతిరేకత స్పందన ప్రత్యక్షంగా కండ్ల ముందు కనిపిస్తుందన్నారు.ప్రతి ఒక్కరూ మళ్లీ మాజీ సీఎం కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారన్నారు.ఇటీవల కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ గడిచిన పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం ఎంత అభివృద్ధి చెందిందన్న విషయాన్ని కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ కళ్ళ ముందు ఉంచారన్నారు.మాయ మాటలు చెప్పి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికే దివాలా తీసిందన్నారు.ప్రభుత్వ పథకాల పేరుతో గ్రామాలలో హడావుడి తప్ప అమలు చేసిన దాఖలాలు లేవన్నారు.అధికార పార్టీ ప్రజా ప్రతినిధులే కాంగ్రెస్ పాలనపై అసమ్మతి వ్యక్తం చేయడం అందుకు నిదర్శనమన్నారు.అసెంబ్లీ స్పీకర్ ప్రసాదరావు స్వయంగా మాకు లెక్కలు అర్థం కాక గతంలో చేసిన అప్పులు చూసుకోకుండా ఎడాపెడా 420 హామీలు ఇచ్చి ఇబ్బందులు పడుతున్నామని ఒప్పుకోవడం జరిగిందన్నారు. ఆ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నే ప్రభుత్వ పనితీరును ఎండబెట్టడం రేవంత్ సర్కార్ పాలనకు సిగ్గు చేటన్నారు.ఒకప్పుడు ప్రభుత్వ బడులలో చదవాలంటే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపించలేదని కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వ విద్యా సంస్థలకు మహర్దశను తీసుకువచ్చారన్నారు. ఈ సమావేశంలో మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ,మాజీ జెడ్పిటిసి ఉన్నం వీరేందర్,మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సొసైటీ వైస్ చైర్మన్ ధరావత్ మంగీలాల్,జిల్లా యూత్ నాయకులు ముత్యాల వెంకట అప్పారావు,అడప పుల్లారావు,మాజీ సర్పంచ్ బాణోత్ కుమార్,శివరాత్రి అచ్చయ్య,బత్తుల శ్రీనివాసరావు,బానోతు రాందాస్,ఇస్లావత్ బన్సీలాల్, సిద్ధంశెట్టి నాగయ్య,జాలా సాంబ,షేక్ ఖాజావలి,యాకుబ్ పాషా,బాబులాల్,సూక్య పాల్గొన్నారు.

## ఊటుకూరు-గాదేపాడు బస్సు సర్వీసు కొనసాగించాలి



**ఖమ్మం టౌన్ , ఫిబ్రవరి 7, మహా:** ఖమ్మం నుండి కామేపల్లి, ఊటుకూరు మీదుగా గాదేపాడు వెళ్లే ఆర్టీసీ బస్సు నిలిపివేతతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ వి రాకేష్ పేర్కొన్నారు. వెంటనే సర్వీసును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం బస్సు డిపో మేనేజర్‌ను కలిసి సమస్యను తెలియజేశారని, కామేపల్లి మండలంలోని గ్రామాలకు కనీస బస్సు సౌకర్యం లేకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. విద్యార్థులు, ఉద్యోగస్తులు, ఇతర ప్రయాణికుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని కొత్త పల్లె వెలుగు బస్సులను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమని హెచ్చరించారు.

## మాజీ జెడ్పీటిసిని పరామర్శించిన ఎమ్మెల్సీ తాత మధు

**కారేపల్లి,ఫిబ్రవరి 7, మహా:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న సింగరేణి మండల మాజీ జెడ్పీటిసి వాంకుడోత్ జగన్ నాయకును శుక్రవారం ఎమ్మెల్సీ,బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్ రావు పరామర్శించారు. భాగ్యనగర్ తండాలో గల జగన్ ఇంటికి వెళ్లిన తాత మధు ప్రమాదం జరిగిన తీరు, ప్రస్తుత ఆరోగ్య స్థితిగతులపై అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పారు ఈ కార్యక్రమంలో మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ,మాజీ జెడ్పీటిసి ఉన్నం వీరేందర్,మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సొసైటీ వైస్ చైర్మన్ ధరావత్ మంగీలాల్,జిల్లా యూత్ నాయకులు ముత్యాల వెంకట అప్పారావు,అడప పుల్లారావు,మాజీ సర్పంచ్ బాణోత్ కుమార్,శివరాత్రి అచ్చయ్య,బత్తుల శ్రీనివాసరావు,ఇస్లావత్ బన్సీలాల్, సుజాత,సిద్ధంశెట్టి నాగయ్య,జాలా సాంబ,షేక్ ఖాజావలి,యాకుబ్ పాషా, బాబులాల్,సూక్య తదితరులు పాల్గొన్నారు.





# మామిడి సాగులో జాగ్రత్తలు

### పిందెలు రాకుండా నీటి తడులు...

మామిడిలో ఏర్పడిన పిందెలు రాలిపోవడం పెద్ద సమస్య. నీటి ఎద్దడి, హార్మోనులు మరియు పోషకలోపాలు వల్ల జరుగు తాయి. పిందెలు ఏర్పడే దశలో మరియు తిరిగి 15-20రోజుల వ్యవదిలో నీటి అవకాశమున్న చోట 2-3 నీటి తడులు ఇవ్వడం మంచి ఫలితాలిస్తాయి. దీని వలన పిందెలు రాలడం తగ్గడమే కాకుండా కాయ నాణ్యత కూడా పెరుగుతుంది.

## మామిడి తోటలను పరిశీలించిన ఉద్యాన అధికారి అపర్ణ

**కూసుమంచి, ఫిబ్రవరి 7,మహా:** కూసుమంచి డివిజన్ పరిధిలో మామిడి పంట 2448 ఎకరాలలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మామిడి పూత నుండి పిందె దశలో ఉన్నది. ఈ సమయం లో జాగ్రత్తలు తీసుకోవాలని పాలేరు నియోజకవర్గ ఉద్యాన అధికారి పి. అపర్ణ సూచించారు.

**రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

1. పూత నుండి పిందె దశలో ఉన్నటువంటి తోటలలో నీటి యాజమాన్యం చాలా కీలకం. నీటిని తక్కువ మోతదులో ఇవ్వాలి. ఎక్కువ ఇచ్చినట్లాయితే తామర పురుగులు, తేనె మంచు పురుగులు మరియు బూడిద తెగులు సమస్యలు పెరుగుతాయి.
2. కావున 8-15 రోజుల వ్యవదిలలో భూములని పట్టి ఇచ్చుకోవాలి.
3. ఈ సమయం లో వచ్చు పైన తెలిపిన ప్రధాన చీడ మరియు తెగుళ్ల నివారణకు 500 లీటర్ నీటిలో ఇమిడాక్లోప్రిడ్ +ఫిప్రోనెల్ (పోలీసు ఈటీసీ)ఏ100 గ్రాములు + ఏమమేక్టిన్ బెంజోయేట్ ఏ250 గ్రాములు + మరినో ఏ1లీటర్ ంబోరన్ 20ఏ500గ్రాములు +హేక్సాకోనాజోలు ఏ1లీటర్ కలిపి చెట్టు అంతా తడిచే విధంగా ఒక్క పిచికారీ చేసుకున్నట్లయితే అన్ని రకాల తెగుళ్ళు మరియు పురుగుల బెడద తగ్గుతుంది.

### ఎరువుల వాడకం

పిందెలు ఏర్పడి పెరిగే దశలో చెట్ల సైజును బట్టి 50-100 గ్రాముల యూరియా, 500-1000 గ్రాముల పోటాష్ ఎరువులను 2 కిలోల వేపపిండితో కలిపి ప్రతి చెట్టుకు వేసుకోవడం వల్ల కాయలు మంచి సైజు లో వచ్చి నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయి. కావున మామిడి రైతులు పైన తెలిపిన విధంగా సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధించాలని ఆశిస్తున్నాము

## బంజారా ఆరాధ్య దైవం సేవలాల్

**కారేపల్లి, ఫిబ్రవరి 7, మహా:** కారేపల్లి మండల కేంద్రంలో లంబాడీల ఐక్యవేదిక (లైవ్) ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతి ఏర్పాట్లపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బంజారాల ఆరాధ్యదైవం సద్గురు సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు సెలవు దినంగా ప్రకటించాలని తహసిల్దార్ సంపత్ కుమార్, ఎంపీడీవో సురేందర్ కు శుక్రవారం లంబాడి ఐక్యవేదిక (లైవ్) భద్రాద్రి జోనల్ ఇన్చార్జి బానోతు బాలు నాయక్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలు నాయక్ మాట్లాడుతూ దేశ జనాభాలో 14 కోట్ల మంది ఉన్న బంజారాలు తెలంగాణలో కన్నుల పండుగగా ఈ వేడుక నిర్వహిస్తామన్నారు. బంజారాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సెలవును అధికారికంగా ప్రకటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సిక్కుల ఆరాధ్యదైవమైన గురునానక్ జయంతి, మహమ్మద్ ప్రవక్త జయంతి ని ఇచ్చే సెలవుల్లో దీనికి సైతం చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు బానోతు రాములు నాయక్, భూక్య సక్రియ నాయక్, ఆంగోత్ రవి (ఠాగుర్), భూక్య రంజిత్ నాయక్, భూక్య మోతిలాల్ నాయక్, లంబాడీల ఐక్యవేదిక (లైవ్) నాయకులు భుక్య రమేష్, ఇంద్రజిత్ తదితరులు పాల్గొన్నారు.



## 10లో నూరు శాతం ఫలితాలు సాధించాలి

**ఖమ్మం, ఫిబ్రవరి - 07:మహా:** రాబోయే 10వ తరగతి పరీక్షలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పిల్లలు చదువుపై శ్రద్ధ పెట్టేలా తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పని చేయాలని అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో పదవ తరగతి పరీక్షల సన్నద్ధత, విద్యా శాఖ కార్యక్రమాలపై నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల అభ్యాసన స్థాయిలలో నాణ్యత పరమైన పురోగతి సాధించాలని తెలిపారు. ప్రైవేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు విద్య అందుతుందన్న నమ్మకం తల్లిదండ్రులకు కల్పించాల్సిన బాధ్యత పాఠశాల ప్రధానోపాధ్యాయులపై ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల బోధన పద్ధతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పిల్లలకు పాఠ్యాంశం సులభంగా అర్థమయ్యేలా బోధన జరగాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో పిల్లలకు ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారు, సబ్జెక్టు బోధించే అంశంలో ఉపాధ్యాయుల దగ్గర ఏవైనా లోపాలు ఉన్నాయా గమనించి అవసరమైన సలహాలను టీచర్లకు హెడ్ మాస్టర్ లు సూచించాలన్నారు. మార్కులపై మాత్రమే కాకుండా పిల్లలకు ఎంత వరకు అర్థం అవుతుంది, చివరి బెంచ్ విద్యార్థికి కూడా సబ్జెక్టుపై ఆసక్తి కల్గించేలా చేయాలని, టీచర్లకు అవసరమైన గైడెన్స్, శిక్షణ అందించాలని అన్నారు.



మహా
8
8-2-2025



# అవినీతి.. కొట్లాటలు

**జిల్లా అధికారులకు తలనొప్పిగా మారిన కూసుమంచి పీహెచ్‌సీ తీరు**

**వైద్యాధికారికి, ఉద్యోగుల మధ్య ముదిరిన వార్**

**ఇద్దరు సూపర్ వైజర్లను సరెండర్ చేసిన వైద్యాధికారి..**

**కూసుమంచి, ఫిబ్రవరి 7, మహా:** వైద్యో నారాయణ హరి అన్నారు పెద్దలు.. వైద్యులు దేవుళ్ళతో సమానంగా ప్రజలందరు భావిస్తుంటాము.. ప్రజలకు, రోగులకు నిత్యం వైద్యసేవలను అందించే వైద్యుల అవినీతి రహిత పరిపాలన అందిస్తుంటారు..కానీ కూసుమంచి మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతా రివర్స్ నడుస్తుంది. ప్రజలకు సేవలందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, ఉద్యోగులు పంచాయతీకి కాలు దువ్వుతున్నారు. ప్రజలకు నిత్యం వైద్య సేవలు అందించాల్సిన వారు నిత్యం గొడవలు పడుతూ వారిపై వారే ఫిర్యాదులు చేసుకుంటున్నారు. దీంతో పి.హెచ్.సికి పరిమితం కావాల్సిన పంచాయతీ కాస్త చిలికి చినికి గాలివానగా మారింది. చివరికి జిల్లా అధికారులు వద్దకు చేరింది. పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటున్న నేపథ్యంలో జిల్లా వైద్యాధికారులు స్పందించి చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరిపై వెయిట్ పడింది. ఇంతటితో పంచాయతీ అగుతుందని అందరు అనుకున్నారు. కానీ వారి మధ్య పంచాయతీ ఆగలేదు. పిహెచ్ సీ లో అవినీతి జరిగిందంటూ ఉద్యోగులు తమ అధికారిపై ఫిర్యాదు చేసే స్థాయికి ముదిరింది. రంగంలోకి దిగిన జిల్లా అధికారులు విచారణ ప్రారంభించారు. అయితే కూసుమంచి పిహెచ్ సీ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా మండల వైద్యాధికారి, ఉద్యోగుల మధ్య గొడవ నడుస్తుండటం గమనర్హం. పూర్తి వివరాల్లోకెళ్తే కూసుమంచి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఇక్కడ వైద్యాధికారితోపాటు మరో వైద్యుడు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. 2023 వరకు కూసుమంచి పిహెచ్సి ఎన్నో అవార్డులను అందుకుంది. ఆసుపత్రి వైద్యులు సిబ్బంది అద్భుతంగా పని చేశారు. ప్రజలకు మెరుగైన సేవలందించే వారు. కరోనా లాంటి మహమ్మారిని సైతం ఎదుర్కొని ప్రజలకు, రోగులకు అధ్భుతమైన సేవలు అందించగా ప్రజలు వారి సేవలను ప్రశంసించారు. ప్రభుత్వం నుంచి అవార్డులతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా ఆసుపత్రి వైద్యుల్ల అభినందించిన పరిస్థితి ఉంది. అలాంటి కూసుమంచి పీహెచ్సీకి ఇప్పుడు అవినీతి మరకపడింది. మండల వైద్యాధికారికి, ఉద్యోగులకు మధ్య పంచాయతీ ముదిరి పాకాన పట్టింది. మండల వైద్యాధికారిగా పనిచేస్తున్న కిషోర్ కు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, సిబ్బందికి మధ్య వర్గ విభేదాలు ఏర్పాడ్డాయి. ఏఎన్ఎంలతో ఉద్యోగం చేయించుకునే విషయంలో ప్రారంభమైన పంచాయితీ కాస్త తారస్థాయికి చేరింది.

## ఇద్దరు సూపర్ వైజర్లను సరెండర్ చేసిన వైద్యాధికారి..

కూసుమంచి పీహెచ్సీలో ఉద్యోగుల మధ్య పంచాయతీ పిక్ లెవెల్ కి చేరినట్లు కనిపిస్తుంది. ఈ పంచాయతీ కాస్త చినుకు చినుకు గాలివానగా మారడంతో గత కొద్ది రోజుల క్రితం వివిధ పత్రికలో కథనాలు వచ్చాయి. దీంతో జిల్లా వైద్యాధికారి స్పందించారు. ఆసుపత్రిని సందర్శించి విచారణ చేపట్టారు. వైద్యాధికారి తో పాటు ఉద్యోగులకు వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో పంచాయతీకి పుల్ స్టాప్ పడుతుందని అందరు భావించారు. కానీ పంచాయతీ మళ్ళీ మొదటికి వచ్చింది. గత కొద్ది రోజుల క్రితం కూసుమంచి వైద్యాధికారి కిషోర్ మండలంలోని కూసుమంచి జక్కేపల్లి సెక్టార్లో పనిచేస్తున్న ఇద్దరు సూపర్వైజర్లు బి. జ్యోతి విజయభారతిలను జిల్లా వైద్యాధికారికి సరెండర్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో వైద్యాధికారికి ఉద్యోగులకు మధ్య పంచాయతీ మరింత ముదిరింది. సరేండర్ బాధితులుగా ఉన్న సూపర్వైజర్లు జిల్లా వైద్యాధికారిని కలిసి కూసుమంచి పిహెచ్సిలో జరిగే అవినీతి గురించి వివరించి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. పల్లె దవాఖానాలు విషయములో భారీగా అవినీతి జరిగిందని అలాగే పల్స్ పోలియో నిర్వహణలో కూడా అవినీతి జరిగిందని ఆరోపిస్తూ జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. జిల్లా అధికారికి పరస్పర ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా వైద్యాధికారి తక్షణమే స్పందించి విచారణకు ఆదేశించారు. జిల్లా డీఎంఆండ్ హెచ్వో కార్యాలయ సూపరింటెండెంట్ తోపాటు మరికొందరు ఉద్యోగులు శుక్రవారం కూసుమంచి ప్రాథమిక ఆసుపత్రిని తనిఖీ చేశారు. డాక్టర్ కిషోర్ ను విచారించిన జిల్లా అధికారులు అక్కడ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. నిధుల దుర్వినియోగంపై వివరణ కోరినట్లు సమాచారం. అలాగే సూపర్వైజర్లు, సిబ్బందిని పిలిచి విచారించినట్లు తెలుస్తుంది. వారు అందించిన సమాచారాన్ని నోట్ చేసుకొని వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే కూసుమంచి పిహెచ్సిలో ఉద్యోగుల మధ్య విభేదాలు పట్ల ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సేవలు అందించాల్సిన వైద్యులు,ఉద్యోగులే పంచాయతీలు పెట్టుకోవడం పట్ల విమర్శలు వెల్లివెత్తుతున్నాయి. తప్పు చేసిన వారిని శిక్షించాలని, తప్పును ప్రోత్సహిస్తున్న వారిని మందలించి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా వైద్యులు, వైద్య ఉద్యోగులు మారతారా..? వేసి చూడాల్సిందే.

# రాజ్యాంగం సాక్షిగా నవ దంపతుల ఆదర్శ వివాహం



**సత్తుపల్లి, జనవరి 7: మహా:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ చిత్రపటం సాక్షిగా. తను రాసిన రాజ్యాంగంపై ప్రమాణం చేసి నవ జంట ఒక్కటైన పెళ్లి వేడుక పెనుబల్లి మండలం టేకులపల్లి గ్రామంలో జరిగింది. వరుడు బీరవల్లి ప్రశాంత్, వధువు నాగజ్యోతి ఇరువురు పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ శుక్రవారం రాజ్యాంగం సాక్షిగా ఆదర్శ వివాహం చేసుకున్నారు. వివాహ తంతును పత్తిపాటి వెంకటేశ్వరరావు, డా”కొచ్చర్ల శ్రీనివాసరావు, మీసాల రామచంద్రరావు (అడ్వకేట్) జరిపించి నవ దంపతులకు వివాహ ధ్రువీకరణ పత్రం అందజేశారు. మతాలకు అతీతంగా జరుపుకున్న వివాహ వేడుకకు హాజరైన గ్రామస్తులు, బంధువులు దంపతులను ప్రశంసించారు.

# తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యచరణ
# మిషన్ భగీరధ డీఈఈ ఓం ప్రకాష్



**నేలకొండపల్లి, ఫిబ్రవరి 7 మహా:** రాబోయే వేసవి లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు రక్షిత మంచినీటి విభాగం ప్రత్యేక కార్యచరణ ను రూపొందిస్తున్నట్లు మిషన భగీరథ డీఈఈ ఓం ప్రకాష్ పేర్కొన్నారు. మండలం లోని నాచేపల్లి తో పాటు వివిధ గ్రామాలలో శుక్రవారం తాగునీటి సరఫరా ను పరిశీలించారు. గ్రామాలలో చేతి పంపులు ఎన్ని ఉన్నాయి... ఎన్ని పని చేస్తున్నాయి. .. త్రీఫేజ్ మోటార్లు నడుస్తున్నాయా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోరు బావుల నుంచి సమృద్ధిగా వస్తుందా లేదా అని తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీరు చేరని చోట అవసరమైన ప్రత్యామ్నయాల పై గురించి ఆరా తీస్తున్నారు. నీటి లభ్యత, పైపులైన్ల లీకేజీ మరమ్మతుల తదితర వివరాలు పంచాయతీ సిబ్బంది ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...వేసవి లో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అవసరమైతే ప్రత్యామ్నయ చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ లక్ష్మి భవాని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శనగకుంటను సర్వే చేసిన అధికారులు



**కూసుమంచి, ఫిబ్రవరి 7, మహా:** కూసుమంచి మండల కేంద్రంలోని ఖమ్మం –సూర్యపేట ప్రధాన రహదారి పక్కనే ఉన్న శనగకుంట భూమిని కూసుమంచి రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. చెరువుల భూములను కాపాడాలని, చెరువు శిఖం భూములకు హద్దులను నిర్ధారించాలని ఇటీవలే రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు స్పందించిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చెరువులకు సంబంధించిన ఎఫ్టిఎల్ ను సర్వే చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు శుక్రవారం కూసుమంచి తహసిల్దార్ కరుణశ్రీ, ఇరిగేషన్ డిఈ రత్నకుమారి ఆధ్వర్యంలో కూసుమంచి శనగకుంటను అధికారులు పరిశీలించి సర్వే చేశారు. ఆర్ఐ రాము, ఇరిగేషన్ ఏఈ కోటేశ్వరరావు, సర్వేయర్లు, సిబ్బంది శనగకుంటను సర్వే చేసి ఎఫ్టిఎల్ హద్దులు నిర్ధారించారు.

# చేడే శ్రీనివాస్ చొరవతో కుట్టు మిషన్ వితరణ



**మధిర, ఫిబ్రవరి 7, మహా:** ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నిరుపేద కుటుంబానికి ఆర్థికాభివృద్ధి అందించేందుకు చేయూతగా కుట్టు మిషన్ అందజేసిన విషయం శుక్రవారం చోటు చేసుకుంది మధిర పట్టణంలోని నిరుపేద కుటుంబానికి చెందిన నంద్రు సునీత అనే మహిళ ఆర్థిక అనారోగ్య ఇబ్బందులతో బాధపడుతుండటంతో మిత్రుల ద్వారా సమాచారం తెలుసుకున్న ప్రముఖ ఉపాధ్యాయుడు సామాజిక సేవకుడు చేడే శ్రీనివాస్ వారి కుటుంబ పరిస్థితిని చూసి చలించిపోయారు ఈ విషయాన్ని ఖమ్మం పట్టణానికి చెందిన దాతలు అనుమోలు జగదీష్ లక్ష్మి దంపతులకు వివరించారు వారి కుటుంబాన్ని పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆమెకు ఆర్థిక సహాయం కంటే ఏదైనా కుటుంబ పోషణ కోసం చేయూతన అందించే దిశగా ఆలోచించి నిత్యం వారికి జీవనోపాధి మరియు ఆర్థిక వెసులపాటు కల్పించే దిశగా కుట్టు మిషన్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కోట జయరాజు ప్రముఖ ఉపాధ్యాయులు షేక్ చాంద్ పాషా ఆవుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు